

లేఖకుడు.
పరశురామ్

అనువాదకుడు.
"చక్రపాణి"

# ప్రేత భూమిలో

శివశర్మ నివాసం పేనిటీగ్రాములో. ఒక భార్య, మూడు ఆవులు, గట్టికొంప, కొద్ది మాన్యం, ఓ పాతికిండ్ల పౌరోహిత్యం-యివి వాని స్థిర చరాస్తులు. హాయిగా కాలం గడపటానికి వానికివి చాలు. శర్మ ముప్పది రెండేండ్ల ప్రాయంవాడు. చిన్నప్పుడు కొద్దో గొప్పో స్కూలులో చదివాడు. తర్వాత తండ్రి దగ్గర కొద్దిగా సంస్కృతంకూడ నేర్చాడు—వాని ఆస్తినీ పౌరోహిత్యాన్నీ పోకుండా పట్టుకోవటానికి యీచదువు చాలు. అన్నీవుండి ఏంలాభం? వాని భార్య నృత్యకాళి పాతికేళ్ల పడుచు. అవయవాలన్నీ తీర్చి దిద్దినట్టు అందంగా వుంటుంది. కాని గయ్యాళిగంప. పతిసేవలో లోటేమీ చేసేదికాదు. శివశర్మకు మాత్రం అందు కంచు కాగడాలుపెట్టి వెదకినా సౌఖ్యం దొరకలా. కాస్తకూ కూస్తకూ భార్యాభర్తలు లడాయి వేసుకునే వాళ్లు. అయిదారు నిమషా లరచేవరకు శర్మకు అలుపొచ్చేది—కాని నృత్యకాళికో? నోరు విప్పిందంటే మూయించటానికి బ్రహ్మదేవుని తరమయ్యేదికాదు. ప్రతిసారి శర్మే తగ్గిపోయేవాడు. భార్యను అలుపులో వుంచలేక పోవటంచేత, శర్మకు, గ్రామస్తులు నపుంసకుడు, పిరికిపంద, చాలీచాలనివాడు మొదలగు బిరుదులు తగిలించారు. యింటా- బయటా- అంతటా అవమానం పొందటంచేత శర్మకు స్థిమితం అనేది లేకుండా పోయింది.

ఒక రోజున శర్మ నడతకూడ సరీగాలేదని నృత్యకాళి చెవిని పడింది. ఇంకేం, ఆరోజున నృత్యకాళి చేతులుకూడ హద్దుమీరాయి- నృత్యకాళి చీపురు శివశర్మ వీపుమీద తాండవమాడింది. పాపం శర్మ కోపాన్నీ, దుఃఖాన్నీ, చాల కష్టంతో కన్నీటినీ ఆపుకొని, ఏదోవిధంగా ఆరాత్రి గడపి తెల్లవారు ఝామునేలేచి ఆరుగంటల బండిలో కలకత్తా బయలుదేరాడు. సియాలదహస్టేషనునుండి తిన్నగా కాళీఘట్టానికి చేరుకున్నాడు. అనేక వుపచారాలతోపాటు అయిదు రూపాయలు కానుకకూడ వేసికొని కాళికి మొక్కుకున్నాడు-'ఓకాళీ! మారినో గీరినో పంపి యీ ముండను లాక్కుపో అమ్మా! నీకు రెండు ఏటలు బలియిస్తా. ఇక భరించలేను. యీ దరిద్రుని కేదో వొక దారి చూపిస్తే క్రొత్త కాపురాన్నైనా ఏర్పాటు చేసుకుంటాడు. యీ ముండకు పిల్లజల్లాకూడ లేరు. యిదికూడ గమనించాలి నీవు! నీదయ, రక్షించు తల్లీ!

గుళ్లోనుంచి శర్మ సరాసరి నూనెమిఠాయి దుకాణానికి వెళ్లేడు. వీశెజిలేబీ, అరవీశె పకొడీ, శేరు పంచదార చిలుకలు దిగుబడకుండా తిన్నాడు. యిక రోజంతా వస్తుప్రదర్శనశాల (మ్యూజియం) జంతుప్రదర్శనశాల(జూ) హాగ్ బజారు, హైకోర్టు అన్నీ చూడటంతో గడిపాడు. సాయంత్రం బీడను స్ట్రీటులోవుండే 'హొటల్- డి- ఆర్థడాక్స్'కు వెళ్ళి ఒకప్లేటు 'కరీ' రెండుప్లేట్లు రోస్టుఫౌలు, యెనిమిదిప్లేట్లు 'డెవిల్' ఫలహారం చేశాడు. రాత్రంతా సినిమా డ్రామాలుచూచి వుదయాన్నే పేనిటీకి తిరిగి వచ్చాడు. పేరేకాని కాళికాదేవి అర్థం చేసుకొంటంలో పొరపడ్డది. నృత్యకాళికి బదులు శర్మను పిలిపించుకొని నృత్యకాళిని ఖాయంగా విధవను చేసింది. ఇంటికి రాగానే శర్మకు కలరా తగి

లింది. వైద్యుడొచ్చాడు, డాక్టరొచ్చాడు, ఫలితం మాత్రం శూన్యం. ఎనిమిది ఘంటలు రోగంతో తీసికొని, భార్య చేత బ్రతిమాలించుకొని, ఏడ్పించి, యీలోకం వదిలేడు శివశర్మ.

*　　*　　*

గ్రామంలో వుంటానికి శర్మమనస్సు వొప్పలా. ఆ రాత్రే గంగానది దాటాడు. పేనిటీకి అవతలకోన్నగరంవుంది. అక్కడి నుంచి వుత్తరపువైపు క్రమంగా రిసడా, శ్రీరామపురం, వైద్యవాటీసంత, చాంపదానీజూట్ మిల్లు వున్నై. ఇవన్నీదాటి నాలుగైదు క్రోసులుపోయి ప్రేతభూమిలో చేరుకున్నాడు శర్మ. ఆచోటు చాలా పెద్దదిగాను, నిర్జనంగాను, భీతావహంగాను వుంది. ఒకప్పుడు యిది యిటుక తీసినచోటు, అందుచేత గుంటలు-మిట్టలు-భూమి సమంగాలేదు. అక్కడక్కడ ఉమ్మెత్తలు, జిల్లేళ్లు, పల్లేరు, తుమ్మ మొదలగుచెట్లు వున్నయి. శర్మకు యీ చోటు చాలానచ్చింది. చిట్టాంవేసిన యిటుకఆవకు ఒకవైపున తాడిచెట్టువుంది. రెండో వైపున-ఆకురాలిన మారేడుచెట్టు వకటి వంకరటింకర త్రిభుజాకారంగా వుంది: శివశర్మ బ్రహ్మరాక్షసై బిల్వ వృక్షాన్ని ఆశ్రయించాడు.

'స్పిరుచుయాలిజం' లేక ప్రేతతత్వం తెలియని వారికి యిక్కడ రెడుముక్కలు చెప్పాల్సివుంది. మనిషి చచ్చినమీదట భూతమౌతాడు. యిదందరు విన్నదే. కాని యీథీరితో స్వర్గ నరక, పునర్జన్మాలకు సంబంధ మెంతవరకు? వాస్తవమేమిటంటే:-నాస్తికులకు ఆత్మవుండదు. వాళ్లు చచ్చినమీదట ఆమ్లజని, ఉద్ జని, నత్రజని మొదలగు వాయువులుగా పరిణమిస్తారు. దొరల్లో ఆస్తికులున్నారే—వాళ్ళకు ఆత్మయితే వుంటుంది-కాని పునర్జన్మలేదు. వాళ్లు చచ్చినమీదట భూతాలై మొదట ఒక పెద్ద 'వెయిటింగ్ రూం'లో పోగౌతారు. కల్పాంతరం తర్వాతగాని వాళ్లకు ఆఖరుతీర్పు వినిపించరు. తీర్పుప్రకారం కొన్నిభూతాలు చిరస్వర్గానికి పంపివేయ బడతాయి. మిగతావన్నీ చిరనరకాన్ని ఆశ్రయిస్తాయి. దొరలు జీవితదశలో అనుభవించిన హక్కులు చాల భూతావస్థతో లాగివేయబడతై. దొరల ప్రేతాత్మలు 'పాస్' లేకుండా 'వైయింటింగ్ రూమ్' వదలిపెట్టలేవు. తెల్ల దెయ్యాన్ని పిలిపించటం ఎంత కష్టమో Seance చూచినవారికి తెలుస్తుంది.

హిందువుల నమ్మకాలు వేరు. మనం పునర్జన్మ, స్వర్గం, నరకం, కర్మ ఫలం, నిర్వాణం, ముక్తి, అన్నీ వొప్పుకొంటాం. హిందువు చచ్చినమీదట భూతమై యిష్టము వచ్చినచోట తిరుగవచ్చు- అవసరం అయితే యిహలోకవ్యాపారంలో కూడ జోక్యం కలిగించుకోవచ్చు. ఇదేమనకున్న వీలు. కాని యీస్థితి యెక్కువ రోజులు వుండదు. కొందరకు నాలుగైదు రోజులకే పునర్జన్మ దొరుకుతుంది. మరికొందరు పది, పదిహేను సంవత్సరాలవరకు పడి వుండవలసి వస్తుంది. ఎక్కడైనా ఒక మొనగాడు రెండుమూడు శతాబ్దాలకు వుంటాడు. భూతాలను అప్పుడప్పుడు ఛేంజికై- అంటే గాలిమార్పుకై స్వర్గ నరకాలకు పంపుతూ వుంటారు. యిది వాళ్ళ హెల్తు'కు కూడ చాలమంచిది. స్వర్గానికి వెళ్లినవాళ్ళ సౌఖ్యం చెప్పనక్కరనేలేదు.- నరకానికి వెళ్ళినవాళ్ళకు పాప క్షయం అవడంచేత సూక్ష్మ శరీరాలు యింకా తేలికైపోతవి. యింతే కాక అక్కడ చాలామంది మహానుభావులతో పరిచయం కూడ కలుగుతుంది.

కాని, అదృష్టంచేత కాశీలో చచ్చినవారికి- లేక నేపాలులోని పశుపతినాథునిగాని, వామనమూర్తి రథోత్సవాన్నిగాని దర్శనం చేసుకున్నవారికి—కాక, తమ పాపాలన్నీ హృషీకేశుని నెత్తిమీద వేసిన నిశ్చింతులవుతారే- వారికి, 'పునర్జన్మ న విద్యతే'- తిన్నగా ముక్తి.

*　　*　　*

శర్మ చెట్టుమీద చేరి రెండుమూడు మాసాలు గడచింది. మొట్టమొదట కొన్ని దినాలవరకు క్రొత్తచోటు క్రొత్తస్థితి చాలా ఆనందం కలిగించినై. శివశర్మకు యిప్పుడిప్పుడే ఏదో లోటుగా వున్నట్లు కనపడసాగింది. నృత్యకాళి స్వభావం కొంచెం కటువైందే- కాని యితనిని చాల ప్రేమిస్తూ వుండేది. శర్మకు యిప్పుడది రోమరోమం. అనుభవం,కా సాగింది. యిక్కడినుంచి జండాపీకి పేనిటీలో పీఠం వేద్దామని

చూచాడు. కాని యీ ముండాకొడుకు చచ్చికూడ భార్య చెరగు వదలలేకపోయాడని ప్రజలు తిడతారని ప్రయాణం మానేశాడు. ప్రస్తుతం యిక్కడే దేన్నో యిష్టమైనదాన్ని చూచి ముడివేసికోవాలని నిశ్చయించుకున్నాడు.

ఫాల్గుణమాసపు ఆఖరిరోజులు. గంగపైగా బయింబయింమని దక్షిణపు గాలి తోలుతుంది. సూర్యుడు నీళ్ళలో మునుగుతూ మునుగుతూ యిప్పుడే అస్తమించాడు. మూలిగపూలవాసన మైదానమంతా కమ్మేసింది. శర్మవున్న మారేడుచెట్టు యిగురు వేసింది. కొద్ది దూరంలోవున్న జిల్లేడు చెట్లనుండి పండిన కాయలు పటపటమని పగలసాగినై. దూది చచ్చిన సాలీళ్లవలె మెరుస్తూ గాలిలో ఎగిరి శర్మవంటిమీద పడసాగింది. పసుపుపచ్చని సీతాకోకచిలుక ఒకటి శివశర్మ సూక్ష్మ శరీరాన్ని భేదించుకొని చప్పుడు చేయకుండా ఎగిరి పోయింది. నల్లని పేడ పురుగొకటి బుర్రు బుర్రుమంటూ శర్మకు ప్రదక్షిణ చేయసాగింది. ప్రక్కనే మారేడు చెట్టుమీద కాకులజంట. కూర్చొని మగకాకివళ్లు వసరించుకొంటూవుంది- ఆడకాకి కళ్లు మూసికొని గద్గద స్వరంతో 'కా, కా', అని అరుస్తూ వుంది. ఒక ఆడకప్ప అప్పుడే నిద్రలేచి మెల్లమెల్లగా ఎగురుకొంటూ మారేడు చెట్టు తొర్రలోంచి బైటకు వచ్చి శర్మకేసి రెప్ప వాల్చకుండా చూడ సాగింది— శర్మ అంటే తనకు లెఖా అన్నట్టు! ఇలకోళ్లు సాయంత్రం కచేరీకై శ్రుతి కలుపుకో మొదలెట్టినై. శ్రుతి కలవంగానే అన్నీ ఏక కంఠంతో కీచు, కీచు, కీచు మన సాగినై.

శర్మకు భౌతికశరీరం పోయిందికాని స్వభావం ఎక్కడకు పోతుంది? శర్మమనస్సు వ్యాకులత చెంద మొదలెట్టింది. యిదివరలో హృదయం వున్నచోట దడ దడ మనసాగింది. యీ ప్రేతభూమిలోనే చిన్న నది వొడ్డున ఒక పిశాచిని వుంటం శర్మకు జ్ఞాపకంవచ్చింది. అది నదిలో చేపలు పట్టుతూవుంటం అనేకసార్లు



"సిగ్గుతో నాలుక కొరుక్కుంది"

చూచాడు శర్మ. దాని శరీరం క్రిందనుంచిపైవరకు సైను గుడ్డతో కప్పబడి వుండేది. కేవలం ఒకసారి మాత్రం ముసుగు తొలగించి శర్మవైపుచూచి సిగ్గుతో నాలుక కొరుక్కుంది. పిశాచిని ఏమంత పడుచుదిగాదు. ముందు పళ్లు రెండుకూడ వూడిపోయినై. దానితో సరసంవరకు ఫరవాలేదు—కాని ప్రేమించడం మాత్రం అసంభవం.

ఒక శాకినికూడ చాలసార్లు శర్మ కంటబడింది. అది ఒక అంగవస్త్రం మొలకు చుట్టుకొని ఒకటి తలపైన వేసికొని కొంగమాదిరి అంగలు వేసుకుంటూ



"పేడ కల్లాపిచల్లుతూ పోతూవుండేది"

పేడ కళ్లాపి చల్లుతూ పోతూవుంటుంది. అదంత, ముదురుదిగా కనుపించదు. శర్మ ఒకమారు దానిని కదలించేవరకు త్రాచుపామువలె బుస్సుమని లేచింది, శర్మకు తోక ముడచక తప్పలా!

శర్మ మనస్సు అందరికంటె ఎక్కువ ఆకర్షించింది ఒక ఢాకిని. అది ప్రేతభూమిలో తూర్పుగా గంగవడ్డున బ్రాహ్మణ పిశాచిని వదలిన పాడుపడ్డ కొంపలో యీమధ్యనే ప్రవేశించింది. శర్మ మొదటి చూపుకే మోహితుడయ్యాడు. ఢాకిని అప్పుడు ఖర్జూరపు ఆకు తీసుకొని వాకిలివూడుస్తోంది. ఒక మల్లుపంచె



"ఖర్జూరపు ఆకుతీసికొని వాకిలి వూడుస్తోంది"

మాత్రం ధరించింది. శర్మను చూడగానే మునుగు వేసికొని కిలకిలనవ్వి మాయమయ్యేది. ఎటువంటి పళ్లు! ఎటువంటి మొహం!! ఎటువంటి రంగు!!! నృత్యకాళి రంగు గులాబ్ జామూను. మరి యీ ఢాకిని రంగో-గులాబ్ జామూనులోవుండే తెలుపు!

* * *

శివశర్మ పెద్దనిట్టూర్పువిడిచి కూనరాగం తీయ సాగాడు:-

"శ్రీ రాధా శ్రీ చంద్రామలీ
ఎవరిని వదలే దిద్దరు భలే-"

హటాత్తుగా తాటిచెట్టుపైనుంచి బ్రరుమని కంఠస్వరం వినబడింది:-

"అరె భుజువాకి చెల్లెలా, భగులూని కూతురా!
ముద్దయితె తీర్చవా, పెళ్లయితె-ఎ.వ.వ-"

శర్మపులిక్కిపడి అన్నాడు-"ఎవడురో, చెట్టు మీద?"

జవాబు-"కాలప్రేతాన్ని"
శివ—"కాలప్రేతానివా? దిగిరామామా?"



"తొండవంటి జీవాత్మ ఒకటి జరున జారివచ్చి"

తెల్లని తలగుడ్డ బొగ్గువంటి మొహంతో తొండవంటి జీవాత్మ ఒకటి జరునజారివచ్చి తల నేలకానించి-"దండాలు బాపనయ్యా" అంది.

శివ-"నూరేళ్లు బ్రతుకు పొగపీల్పిస్తావా?"

కాలప్రేతం-"చిలుముందా?"

శివ-"పొగాకులేంది చిలు మెందుకు? నెత్తినేసుకోనా! ఎక్కడన్నా లంకించుకురా."

ప్రేతం పైకెగిరింది. కొంచంసేపట్లోనే వైద్యవాటీ సంతనుండి పొగాకు, చిలుము, కొబ్బరిపీచు తెచ్చి చిలుము వెలిగించి శర్మకు యిచ్చింది.

శర్మ దమ్ము వేస్తూ ప్రశ్నించాడు- “నీ వొచ్చిఎన్నాళ్లయింది? నీకథ ఏమిటో చెప్పు విందాం.”

ప్రేతంచెప్పిన కథాసారాంశమిది:-వాడు ఛపరా జిల్లా వాడు. దేశంలో ఒకప్పుడు వానికిభార్య, యిల్లు, పొలం, గొడ్డు గోద, అన్నీ వుండేవి. కాని వానిభార్య తగువులమారిది. దానికి వీడికి పడేదికాదు. ఒకరోజున పొరుగింట భుజవాచెల్లెలు విషయమై మొగుడూ పెళ్ళాలకు బాగా తగువు జరిగింది. మొగుడుపెళ్ళాన్ని నాలుగు వుతుక్కొని యిల్లువదలి కలకత్తా చేరాడు. యిది ముప్ఫై సంవత్సరాల క్రిందటిమాట కొన్నిరోజులయాక ‘ముంగరీ’ మశూచికంపోసి చచ్చిందని కబురు వచ్చింది. ముంగరీమగడు మళ్లీ దేశంవెళ్లలేదు-పెళ్ళి కూడ చేసికోలేదు. అనేకచోట్ల నౌకరిచేస్తూ ఆఖరుకు చాంపదానీజూట్‌మిల్లులో కూలీగా చేరి సర్దారయ్యాడు. కొద్దిరోజులక్రిందట ‘హావిజ్’ (యినుపతనాబీ) పైకెత్తేటప్పుడు తలకు దెబ్బతగిలింది. ఒకనెల ఆస్పత్రిలో తీసుకొన్నాడు. ప్రస్తుతం పంచత్వంచెంది ప్రేతరూపంతో యీ తాటిచెట్టుమీద విరాజిల్లుతూ వున్నాడు.

శర్మ పెద్దపీల్పుపీల్చి చిలుము ప్రేతంచేతికి యివ్వబోతూవుండగా భూమిలోంచి ఓటికంచుమోతలాంటి గొంతు వినబడింది-“బ్రదర్! చిలుములో ఏమన్నా దిగుబడిందా?”

మారేడుచెట్టుదగ్గరున్న యిటుకామలోంచి కొన్ని రాళ్లు జారిపడ్డై. ఆసందులోంచి మోకాళ్లతో దేక్కుంటూ ఒకమూర్తి బైటకు వచ్చింది. పొట్టిగా లావుగా పీపాలాంటి ఆకారం. మొహం రెండు ప్రక్కల పీచువదలి కొబ్బరికాయలా వుంది. బట్టతల, మెళ్లో రుద్రాక్షమాల, ప్రక్కగుండీల బనీను, పట్టుధోవతి, కాళ్ళకు కలకత్తా స్లిప్పర్లు. ఆగంతుకుడు శర్మచేతినుంచి చిలుము తీసికొంటూ అన్నాడు— “బ్రాహ్మలా? దండాలుస్వామీ! కొద్దిగా ఆస్తివుంది—యిక్కడే పాతేసి; అందుచేత యక్షుణ్ణై కాపలాకాస్తున్నా. ఎక్కువేమీలేదు—నాలుగ్గైదు వంద లుండొచ్చు. అన్నీ తాకట్టు



“ అన్నీ తాకట్టు పత్రాలే ”

పత్రాలే, బ్రదర్! స్టాంపుమీద వ్రాసివున్నయి-రొక్కం దమ్మిడీకూడ దొరకదు. జాగ్రత్త; అటు చూచేవు?—చేతులకు సంకెళ్లు పడతై. ఛూ. ఛూ.”

శివశర్మకు మేఘదూత కొద్దిగా జ్ఞాపకం వుంది. అతను సాదరంగా అడిగాడు- “అయ్యా! తమరు కాళిదాసుని-”

యక్షుడు—“అదే వాడు మా షడ్రకుడే. కాళిదాసు మా పిన్నత్త కూతుర్ని పెళ్లిచేసుకొంది. వెధవాయి హిజిలీ వుప్పు కొఠారిలో గుమస్తాగా వుండేవాడు; వాడు చచ్చికూడ చాల రోజులైందే- నీకు వాడి పేరెట్లా తెల్సింది బ్రదర్?”

శివ—“తమరు యిక్కడకు దయచేసి ఎన్ని దినాలైంది?”

యక్షుడు—“నేనొచ్చా? అహహా! ఓ ముప్పాతిక శతాబ్దమయిందనుకో. నా కళ్ళెదుట ఎంతోమంది వచ్చారు, పోయారు. నీవారోజునే కాదూ, వచ్చింది? చీమలుమలిపి- మూడుసార్లు జారిపడి- చెట్టెక్కావు! అంతా చూస్తూనే వున్నా నేను. నీకు సంగీతపు పిచ్చికూడా వున్నట్లుందే.—మంచిదే గానకళ నేర్చుకోవాలంటే నా శిష్యుడవుగా. తెల్సిందా, బ్రదర్! యిప్పుడు గొంతు కొంచెం జీరపోయింది అయినా ఏనుగుచచ్చినా పది వేలే, బ్రతికినా పదివేలే! తెలుసా?”

శివ—"దేవరవారి పూర్వచరిత్ర తెలుకో వచ్చా?"

యక్ష—"బాగా అడిగావు! నా పేరు నాదిర్ చంద్రమల్లిక్. వృత్తి వుద్యోగం, జాతి కాయస్థ, నివాస స్థానం రిసడా, హాల్ మకాం యీయిటుక ఆమలో; పూర్వ వృత్తి పోలీస్ యిన్‌స్పెక్టరు, సర్కిల్ రిసడా నుంచిభద్రేశ్వరంవరకు చార్జి.టీ దొరగారిపేరువిన్నావా? హుగ్లీ జిల్లా కలెక్టరు. నేనంటే ప్రాణాలు విడిచేవాడు. యిలాకాలో అధికారాలన్నీ నాకే యిచ్చేశాడు. ప్రజలకు నాదిర్‌మల్లిక్ అంటే హడల్"

శివ—"దేవరవారి కుటుంబంలో ఎవరెవరున్నారు?"

యక్షుడు ఒక పెద్ద నిట్టూర్పు విడిచి జవాబు చెప్పేడు—"అన్ని సుఖాలు ఒకని అదృష్టంలో అబ్బుతాయా బ్రదర్? యిల్లు వాకిలీ అన్నీ వున్నై. కాని, యిల్లాలే కాలాంతకురాలు. ఏం చెప్పేది? నేనా నాదిర్ మల్లిక్‌ని-కుంపినీవారి సివిల్, క్రిమినల్, పోలీస్ అన్ని అధికారాలు నా గుప్పిట్లో వున్నై. అటువంటివాడి వీపు మీదనే కాలేకాలే కొరివిపెట్టి కన్నారింటికి వుడాయించింది. మూడువందల యిరవైనాలుగో శెక్షనులో యిరికించేవాడినే, కాని ఏంచేసేది? అల్లరిపడిపోతానని అరెస్టువారంటు పంపించలా. కాని ఎక్కడకు పోతుందీ-దేముడు లేడూ పైని? 1857 సంవత్సరంలో వచ్చిన దూముల్లో 'ధాం' మని ఎగిరింది. యిక సంసారమంటే వెగటేసింది. జార్జిటీదొర విదేశం వెళ్లిపొయ్యాక నేను కూడ పెన్షను తీసికొని వీధిభాగవతులకు నాయకుణ్ణయ్యా. తర్వాత పరమాయువు పూర్తికాగానే యిక్కడకువచ్చి పీఠంవేశా. పిల్లాజల్లా కలగలేదు—కలగలేదనే దిగులుకూడ లేదునాకు. నేను చెమటోడ్చి సంపాయిస్తే ఏ ముండాకొడుకో భూతంలోంచి మనిషై నా యింట్లోపుట్టి నాఆస్తికి వారసుడవటం- బ్రదర్ నేను సహించలేను. యిప్పుడే చాలా హాయిగావున్నా-నా ఆస్తిని స్వంతంగా కాపాడుకొంటూ. గంగవద్దున గాలి మేయడం- శివశివ అంటం, యిదే నా దినచర్య. సరే నా సంగతంతా విన్నారు. మీసంగతి కూడా చెప్పండి."

శివశర్మ తన కథంతా వినిపించాడు. తర్వాత కాలప్రేతాన్ని కూడా ఎరుక పర్చాడు.

యక్షుడన్నాడు-"మన మందరం ఒక బళ్ళోవాళ్లంగానే వున్నాము. ప్రాతసంగతులు త్రవ్వకొని దుఃఖించట వ్యర్థం-యిక కాసేపు పాడుకుందాం మద్దిల లేంది రక్తికూడ కట్టదు. సరే పొట్టమీదనైనా వాయిస్తాను.-ఉహు-డబడబ మ్రోగుతోంది. అరేమామా! కాస్త బంకమట్టి ఎత్తుకురా ఎక్కడినుంచైనా; పెట్టు, యిక్కడే మధ్యని-చౌతాళం తెలుసా? ఆరుమాత్రలు-నాలుగు దెబ్బలు, రెండుకాళీ, విను-

ధాధా దిన్ తా కిట తా

ధిన్ తా తేరే కేట్ గేనే ధా-

ధామీద సమం ధాచెడగానే పానకంలో పుడకలా రసాభాసమవుతుంది. అరేమామా! చిలములో పుగాకు వేసుకురా. గొంతుకూడ పట్టుకుపోయింది."

* * *

ప్రయత్నిస్తే ఫలించకపోదు. చాల ప్రాధేయపడ్డమీదట ఢాకిని శర్మతో వుంటానికి వొప్పుకుంది. కాని యింతవరకు ముసుగు తీయలేదు. మాట్లాడనూలేదు. సైగలతోనే పని జరిపింది. శర్మ నేడు భౌతిక పద్ధతులతో వివాహం చేసుకోబోతున్నాడు. ప్రొద్దుక్రుంకగానే దేహమంతా గంగా మృత్తిక పులుంకొని స్నానంచేశాడు. ముళ్లకంపతో తల దువ్వుకొని పిలక్కు మారేడుకాయ కట్టుకొన్నాడు. ఆ మరుభూమంతా తిరిగి, అతి ప్రయాసతో మూలిగపూలు; పల్లేరుకాయలు, అడవి సీతాఫలాలు మారేడు ఆకులు ప్రోగుచేశాడు. సాయంత్రం నక్కలు 'కన్సర్టు' మొదలెట్టగానే ఢాకిని యింటికి ప్రయాణమయ్యాడు శర్మ. ఆరోజు శుక్ల చతుర్దశి. నట్టింట్లో చామాకు మీద ఢాకిని కెదురుగా కూర్చొని మంత్రాలు మొదలెట్టబోతూ, ఉబలాటంగా "యిక ముసుగుతీయాల్సి వుంటుందే" అన్నాడు శర్మ. ఢాకిని ముసుగుతీసివేసింది.

శర్మ వులిక్కి పడ్డాడు. "ఏ! నృత్యకాళివా?" అని బెదురుతూ బెదురుతూ అన్నాడు.

"ఔరా అబ్బీ! చచ్చి నాచెర వదిలించుకుందా మనుకున్నావా? శాకినీ పిశాచినులమీద పోయిందీ మనస్సు!!" నృత్యకాళి అంది.

శివ-"యిక్కడకు ఎట్లావచ్చా? కలరా తగిలిందా యేం?"

నృత్య-"కలరా తగిలేది నీబోటివాడికి, ఇంట్లో కిరసనాయిలు లేదూ?"

శివ-"అందుకనేనా మొహంఅంత తళతళ్ళాడుతోంది. వుటంబెడితే బంగారానికికూడ వన్నె వస్తుంది. స్వభావంకూడ మారిందా, అట్లానే వుందా?"

బయట యీఅల్లరేమిటీ? శుభకార్యానికి అడ్డు వచ్చింది. పులివిస్తరాకుల దగ్గర కుక్కలమాదిరిగా కరచుకోవడం, పీక్కోవడం, రక్కుక్కోనడం. శాకినీఢాకినీలు శరవేగంతో వచ్చేశాయి. తలుపు నెట్టి గందరగోళం చేయ సాగినై.

[భూతాలు ముక్కు తో మాట్లాడుతాయి. వాటి వుచ్చారణ సరిగా వ్రాయాలంటే ప్రెస్సులో వుండే అరసున్నాలు చాలవు. కాబట్టి కంపాజిటర్ దేవతల వీలుకై అరసున్నాలు వదలివేయ బడుతున్నాయి పాఠకులు యిచ్ఛానుసారం తగిలించుకోవచ్చు]

పిశాచిని-"నా మొగుణ్ణి నీకెట్లా వదులుతానే?"

శాకిని-"చావు ముసలి తొక్కా, వాడు నీ మనుమడులా వుంటాడు."

పిశాచిని-"ఓహొహొహో! నీవే కాబోలు పడుచు పిల్లవి!"

శాకిని-"పో, పో, చాపలు పట్టుకునే చవితా. నేను వాడి రెండు జన్మాల క్రిందటి భార్యను."

పిశాచిని-"ఛీ, పో, మురికి ముండా! నేనువాడి మూడు జన్మల క్రిందటి భార్యను.

శాకిని-"నీవు యిక్కడ అరచిచావు. అక్కడ ఢాకిని వాడిని తీసుకొని మాయమవుతుంది."

పిశాచిని మంత్రంచేత తలుపు బంధించి అంది-"ముందు నీగొంతు పిసుకుతాను, తర్వాత ఢాకినీని తింటా."

యికచూడు రక్కటం, పీకటం, కొరకటం, ఆరంభమైంది. ఒక నృత్యకాళితోనే వేగడం కష్టంగా వుంటే, వెనకటి రెండు జన్మాల యిద్దరు భార్యలువచ్చి నెత్తికెక్కారు శర్మకు. శర్మ జంధెంపట్టుకొని గాయత్రి జపించ మొదలెట్టాడు. నృత్యకాళి కోపంతో వుడికి పోతూవుంది. నేపథ్యంలో యక్షుని పాట వినబడింది:-

"యిల్లువదలీ సిగ్గువదలీ మగనివదలీ కులము వదలీ, అన్నివదలి నిన్నె దలచితి గదరా.

చల్-మోహనరంగా, అర్ధరాత్రి లేచి పోదాం పదరా!

"అరే, బదర్! ఏమిటీగోల?" యక్షుడు వాకిటి దగ్గరకువచ్చి కేకవేశాడు!

కాలప్రేతం-"అరే బాపనపిశాచా! తలుపు తియ్యి."

శర్మ పైప్రాణాలుపైనే పోయినై తలుపు ఘట్టిగా నెట్టినై భూతాలు. మంత్రంచేత బంధింపబడి వుండటం చేత గొళ్ళెంవూడలేదు, తలుపుకూడ విరుగలేదు. అప్పుడు కాలప్రేతం ఉత్పాటనమంత్రం బిగ్గరగా చదువ సాగింది.

"వాకిలీ తెరవాలి - హైలేసో
ఇంకా కొంచెం - హైలేసా
కొండలే ఎగరాలి - హైలేసో

ఇంజను కదలాలి - హైలేసా

బాయిలర్ గపలాలి - హైలేసో

ఖబర్దార్ - హాఫిజ్."

బడబడమని గోళ్ళెము, తలుపు, కప్పు, యిల్లు, గోడలు మొత్తం ఆకాశంలో కెగిరి దూరంగాపోయి పడ్డై. ఢాకిని అనగా నృత్యకాళిని చూచి యక్షు డన్నాడు-"అరే యిది మా ఆవిడేనే, యిక్కడి కెట్లా వచ్చా? బ్రహ్మ దైత్యుడితోనా? ఛీఛీ, సిగ్గు శరము దిగమ్రింగా?"

ఢాకిని ముసుగు వేసికొని మూల నక్కింది.

కాల్మప్రేతం-"ఏమే ముంగరీ! నీకు సిగ్గు లేదూ?"

తర్వాత జరిగినగోల తల్చుకుంటే కలంలో సిరా కాస్తా యిగిరిపోతుంది. శివశర్మ మూడుజన్మాల ముగ్గురు భార్యలు, నృత్యకాళి మూడు జన్మాల ముగ్గురు భర్తలూ యీ డబుల్ త్రిసమ్మేళనంవల్ల- ప్రేత భూమిలో ఒక్కసారే జలస్తంభన, వాయుస్థంభన, అగ్నిస్థంభన, భూకంపము కలిగినై. భూత, ప్రేత, దైత్య, పిశాచ, తాల, భేతాల యిత్యాది దేవీవుపదేవతలు ఎక్కడెక్కడినుండో తమాషా చూట్టానికి వచ్చాయి. స్ఫూర్, ఫిక్స్, నోమ్, గబ్లింగ్ ఆది మీసాలు గొరిగించిన విదేశీ భూతాలుకూడ బ్యాండు మేళాలతో డాన్సు చేయసాగినై. జిన్, జిన్డ్, ఆఫ్రీదీ, మారీదీ వగైరా బారుగడ్డాల కాబూలీ భూతాలుకూడ ఆడసాగినై. చింగ్, చాంగ్, ఫైచంగ్ మొదలగు చైనా భూతాలుకూడ మొగ్గవేయ సాగినై.

రామ! రామ!! యీ దాంపత్య సమస్య ఎవడు పరిష్కరిస్తాడు? నావల్లకాదు. భూతజాతి ధైర్యము వదిలే నపుంసక జాతికాదు. గుడ్డిగవ్వలతో సహా తమ హక్కులు వసూలు చేసుకుంటవి. పురుషుల పురుషత్వం స్త్రీలస్త్రీత్వం, భూతాల భూతత్వం, పిశాచాల పైశాచీత్వం-యివన్నీ వాటికి బాగా తెలుసు. కాబట్టి నామన వేమంటే, శ్రీయుత శరత్ చటర్జీ, చారు బెనర్జీ, నరేశ సేన్, యతీంద్రసింహా, వీరందరు కన్నట్లయి- వాళ్ల కాపురాలు చెడకుండా వుంటానికి- ఏవిధమైన నీతి విరుద్ధకార్యం జరగకుండా వుంటానికి-వాళ్ల వాళ్ల హక్కులు నిరూపించెదరుగాక; వీరివల్ల కానట్లయితే కొద్దో గొప్పో చందా వసూలుచేసి గయలో పిండదానమైనా చేస్తే- యిక ముందైనా శాంతితో వుంటాయి.

